సాక్షి
వికారాబాద్
శుక్రవారం ♦ 8 ♦ నవంబర్ ♦ 2024



రైతులకు ఇబ్బంది కలగొద్దు
రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. 10లో▸



పోషకాహారం ఇవ్వాలి
బాలసదనం చిన్నారులకు పోషకాహారం ఇవ్వాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ప్రధాన కార్యదర్శి శీతల్ అన్నారు. 10లో▸



బడికి దారేది?
పెద్దేముల్ మండలం తట్టెపల్లి శివారులోని పాఠశాలకు దారి లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. 11లో▸

సమగ్ర సర్వేకు సహకరించండి

కలెక్టర్ ప్రతీక్‌జైన్



ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పూడూరు: ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే దోహదపడుతుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. గురువారం మండలంలోని చెంచుపల్లిలో సర్వే ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలు గ్రామంలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సర్వే కోసం గ్రామాలకు వచ్చే అధికారులకు పూర్తి సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. ఇంటి యజమాని ఇచ్చిన వివరాలను మాత్రమే ప్రొఫార్మాలో పొందుపరచాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. ఎలాంటి తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. గ్రామంలో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. పట్టాదారు పాసుపుస్తకాల సమస్యలు, ఇతర భూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని రైతులకు సూచించారు. గ్రామంలో విద్యుత్ తీగలు కిందకు ఉన్నాయని ప్రజలు కలెక్టర్‌కు తెలియజేశారు. స్పందించిన ఆయన వెంటనే సరిచేయాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. సమస్యలు, పిల్లల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పెన్నులు, నోటు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, తహసీల్దార్ భరత్, ఎంపీడీఓ పాండు, అంగన్‌వాడీ టీచర్ విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా వివరాలు సేకరించాలి

దౌల్తాబాద్: ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ ఆదేశించారు. గురువారం దౌల్తాబాద్, ర్యాలగుట్టతండాలో సర్వే ప్రక్రియను పరిశీలించారు. ప్రతి ఇంటికీ స్టిక్కర్ అతికించాలని సూచించారు. సర్వే కోసం వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాకు భూములివ్వం

- తేల్చి చెప్పిన రైతులు
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన



ఉప తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఫార్మా భూ బాధితులు

దుద్యాల్: ఫార్మాసిటీ ఏర్పాటు కోసం బలవంతంగా భూములు లాక్కోవాలని చూస్తే ఊరుకునేది లేదని బాధిత రైతులు హెచ్చరించారు. అలాగే ప్రజల అభిప్రాయం తెలుసుకునేందుకు నిర్వహించే సమావేశాలను బహిష్కరిస్తామని తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద మండలంలోని లగచెర్ల, పోలేపల్లి, హకీంపేట్, రోటిబండ తండా, పులిచెర్లకుంట తండాకు చెందిన రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ గ్రామాల పరిధిలో 1,375 ఎకరాల్లో ప్రభుత్వం ఫార్మా కంపెనీ ఏర్పాటుకు సిద్ధమవుతోందని తెలిపారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కొన్ని నెలలుగా ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఉప తహసీల్దార్ బలవంతంగా భూములు తీసుకోమని తెలిపారు.







క్లుప్తంగా

మమతారాణికి డాక్టరేట్



నక్షత్రాల గమనంపై ప్రజెంటేషన్ ఇస్తున్న మమతారాణి

కొడంగల్ రూరల్: పట్టణానికి చెందిన గడ్డం మమతారాణి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఖగోళ శాస్త్రంలో గురువారం పీహెచ్‌డీ పట్టా పొందారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీరామ్ పర్యవేక్షణలో ఖగోళ శాస్త్రంలో నక్షత్రాల గమనం అనే అంశంపై పరిశోధనలు చేసి గ్రంథాన్ని సమర్పించారు. డాక్టరేట్ పొందిన మమతారాణిని పలువురు అభినందించారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్



విద్యార్థిని సన్మానిస్తున్న హన్మంతుముదిరాజ్

పరిగి: జాతీయ స్థాయిలో రాణించి పరిగి కీర్తి ప్రతిష్ఠలను నిలబెట్టాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్ పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని న్యూ బ్రిలియంట్ హైస్కూల్ విద్యార్థి ఆకాశ్ అండర్ 14లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన సందర్భంగా గురువారం విద్యార్థిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాస ప్రత్యేక పూజలు



ధారూరు: మండల పరిధిలోని వివిధ దేవాలయాల్లో కార్తీకమాసం ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి మండల కేంద్రంలోని శ్రీ వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో నెలకొన్న కపిలేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగం ముందు కార్తీక దీపాలను వెలిగించి భక్తితో మొక్కుకున్నారు. ఆలయ పూజారీ చెన్నబసవయ్య స్వామి భక్తులకు హారతి ఇచ్చి తీర్థ, ప్రసాదాల వితరణ చేశారు.

క్రిమి సంహారక నీరు తాగి మేకల మృతి



మేకల కళేబరాలు

మర్పల్లి: క్రిమి సంహారక మందు కలిపిన నీరు తాగి నాలుగు మేకలు మృతి చెందగా.. మరో పది అస్వస్థతకు గురయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బేగరి నర్సింలు తనకున్న 40 మేకలను రోజువారీగా మేత మేపేందుకు సమీప గ్రామమైన తుమ్మలపల్లి పొలాలకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో సాయంత్రం మేకలకు నీరు తాపేందుకు ఓ పొలంలో ఉన్న బావి వద్దకు తోలుకెళ్లాడు. అక్కడ ఉన్న హౌజ్‌లో(నీటితొట్టి) రైతు గడ్డి మందును కలిపి ఉంచాడు. ఈ విషయం గమనించని నర్సింలు ఆ నీటిని మేకలకు తాపించాడు. గంట వ్యవధిలో నాలుగు మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 10 మేకలు అస్వస్థతకు గురికావడంతో వెంటనే తెలిసిన వారితో పశుసంవర్ధక శాఖ వైద్యాధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకొని మేకలకు వైద్యం అందించారు. మృతి చెందిన మేకల విలువ సుమారు రూ.40 వేల వరకు ఉంటుందన్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశారు.

మార్గానికి మార్కింగ్

‘గ్రీన్‌ఫీల్డ్‘కు వడివడిగా అడుగులు

- తొమ్మిది గ్రామాలు.. 449.27 ఎకరాలు
- రహదారి కోసం భూ సేకరణ
- ఇప్పటికే నోటిఫికేషన్ జారీ
- క్రయవిక్రయాలపై ఆంక్షలు
- ఆయా గ్రామాల్లో మార్కింగ్ మరూ



కందుకూరు మండలం లేమూరు, తిమ్మాపూర్‌లో వేసిన మార్కింగ్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన ఫోర్త్‌సిటీ కోసం ఎలివేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిమిత్తం భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసింది. మూడు మండలాల పరిధిలోని తొమ్మిది గ్రామాల మీదుగా ఆరు లేన్లు(300 అడుగుల వెడల్పు)గా ఈ రోడ్డును ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వం (రెవెన్యూశాఖ) భూ సేకరణ కోసం ఇటీవల (జీ2/349/2024) నోటిఫికేషన్ సైతం జారీ చేసింది. భూసేకరణ చట్టం–2016 (యాక్ట్21/2017)తో పాటు పునరావాస కల్పన చట్టం–2013 (యాక్ట్ 20/2013) ద్వారా భూసేకరణ చేస్తున్నట్లు ప్రకటించింది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న భూ యజమానులెవరూ చట్టంలోని సెక్షన్ 11(4) కింద ఈ భూమిలో ఎలాంటి లావాదేవీలు నిర్వహించరాదని పేర్కొంది. రుణాల కోసం కూడా ఈ భూములను తాకట్టు పెట్టొద్దని సూచించింది. అభ్యంతరాలను నోటిఫికేషన్ వెలువడిన 60 రోజుల్లో దాఖలు చేయొచ్చని సూచించింది.

రహదారి వెంట మెట్రో కూడా..

ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13 నుంచి మీర్‌ఖాన్‌పేటలో ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయాలని భావించిన స్కిల్ యూనివర్సిటీ వరకు 6 లేన్ల రోడ్డు నిర్మాణానికి 449.27 ఎకరాల భూమి అవసరమని ప్రాథమికంగా అంచనా వేసింది. ఈ మేరకు మహేశ్వరం మండలం కొంగరకుర్దు–ఎ, ఇబ్రహీంపట్నం మండలం ఫిరోజ్‌గూడ, కొంగరకలాన్, కందుకూరు మండలం లేమూరు, రాచలూరు, తిమ్మాపూర్, గుమ్మడవెల్లి, పంజాగూడ, మీర్‌ఖాన్‌పేట్ వరకు 449.27 ఎకరాల భూమి సేకరించనున్నట్లు పేర్కొంది. ఇప్పటికే ఆయా మార్గాల్లో మార్కింగ్ కూడా చేసింది. ఈ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు వెంటే.. మెట్రో రైలు విస్తరణ పనులు చేపట్టనుంది.

ఎక్కడ ఎంతంటే?

- ఇబ్రహీంపట్నం మండలం ఫిరోజ్‌గూడలో 84 మంది రైతుల నుంచి 1.03 ఎకరాలు.
- కొంగరకలాన్‌లో 361 మంది రైతుల నుంచి 55.05 ఎకరాలు.
- మహేశ్వరం మండలం కొంగరకుర్దులో 278 మంది రైతుల నుంచి 53.20 ఎకరాలు.
- కందుకూరు మండలం లేమూరులో 497 మంది రైతుల నుంచి 84.28 ఎకరాలు.
- తిమ్మాపూర్ రెవెన్యూలో 290 మంది రైతుల నుంచి 47.02 ఎకరాలు.
- రాచలూరు రెవెన్యూలో 351 మంది రైతుల నుంచి 87.22 ఎకరాలు.
- గుమ్మడవెల్లి రెవెన్యూలో రిజర్వు ఫారెస్ట్ స్థలం 32.11 ఎకరాలు.
- పంజాగూడ రెవెన్యూలో టీజీఐఐసీ నుంచి 18.33 ఎకరాలు.
- మీర్‌ఖాన్‌పేటలో 48 మంది రైతుల నుంచి 62.08 ఎకరాల చొప్పున సేకరించనున్నారు.

రైతులకు ఇబ్బంది కలగొద్దు

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



కుల్కచర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు, నేతలు

కుల్కచర్ల: రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. గురువారం కుల్కచర్లలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం సేకరణలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వరాదన్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, కుల్కచర్ల పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీఓ రామకృష్ణ, ఏపీఎం శోభ, ఇన్‌చార్జ్ ఎంపీఓ భాస్కర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆనందం, మాజీ సర్పంచ్ జోగు వెంకటయ్య, జిల్లా రజక సంఘం ప్రధాన కార్యదర్శి మోత్కూరు వెంకటేష్, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ అమలు చేయాలి



మాట్లాడుతున్న పద్మ



మహిళా సమాఖ్య సభ్యత్వ నమోదు

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ

తాండూరు టౌన్: మహిళా రిజర్వేషన్ చట్టం –2023ను సవరించి, షరతులను తొలగించి చట్ట సభల్లో అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ పేర్కొన్నారు. గురువారం తాండూరు పట్టణంలో భారతజాతి మహిళా సమాఖ్య వికారాబాద్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన మహాసభకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్లు అమలయ్యేలా పోరాటం చేయాలన్నారు. ఈ నెల 23వ తేదీన మహిళా రిజర్వేషన్ల అమలుపై హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర మహిళా సదస్సును జయప్రదం చేయాలని ఆమె పిలుపు నిచ్చారు. మహిళలకు ఇళ్ల స్థలాలు, పింఛన్లు, రేషన్ కార్డుల పునరుద్ధరణ, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. అవినీతి వ్యతిరేక పోరాటాల్లో తాండూరు ప్రాంత మహిళల పాత్ర మరువలేనిదన్నారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ మాట్లాడారు. మహిళల్లో చైతన్యం కలిగిస్తూ, వారిలో పోరాట శక్తిని పెంపొందిస్తే, రాజకీయ నాయకులు వారిని చౌక కూలీలుగా పరిగణించడం శోచనీయమన్నారు. మహిళలకు విద్య, వైద్యం, ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా విజయలక్ష్మి పండిట్, అధ్యక్షురాలిగా నసీమా బేగం, కార్యదర్శిగా జగదాంబ, ఉపాధ్యక్షురాలిగా సావిత్రి, చంద్రమ్మ, పున్నెమ్మ, సహాయ కార్యదర్శులుగా పుష్ప, సంతోష, పద్మ, కార్యవర్గ సభ్యులుగా మంగమ్మ, తుల్జమ్మ, రత్నమ్మ, రాములమ్మ, పోచమ్మ, లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన సభ్యత్వ నమోదు నిర్వహించారు.

ప్రమాదకరంగా మలుపు

- కనిపించని సూచిక బోర్డులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



యూ ఆకారంలో కొత్తపల్లి మలుపు రోడ్డు

బంట్వారం: మలుపు రోడ్లు ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. కోట్‌పల్లి మండల పరిధిలోని కొత్తపల్లి పంచాయతీ రాజ్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. సుల్తాన్‌పూర్‌కు వెళ్లే ఈ రహదారిలో రెండు చోట్ల మలుపు తిరిగి ఉంది. ఒక చోట పూర్తిగా యూ ఆకారంలో ఉండగా మరో చోట చెరువు దగ్గర మూల మలుపు ప్రమాదకరంగా కనిపిస్తుంది. ఇక్కడ ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. చెరువు సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ముళ్ల కంచెలు, పొదలు దగ్గరగా ఉండడంతో ద్విచక్రవాహన దారులు తరుచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళ అటుగా వెళ్లాలంటేనే జంకుతున్నారు. మలుపు రోడ్లు ఇంత ప్రమాదకరంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు సూచికబోర్డులు వంటివి ఏర్పాటు చేయడం లేదు. ఈ విషయంలో పట్టించుకునే వారు లేరు. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో వాహన దారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య



జయమ్మ (ఫైల్)

పరిగి: వ్యక్తిగత కారణాలతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గడిసింగాపూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంద్రపు జయమ్మ(41) భర్త వెంకటయ్య 15 ఏళ్ల క్రితం మృతి చెందడంతో కుమారుడి కలిసి ఉంటుంది. రెండేళ్లుగా పరిగి ప్రభుత్వ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిన స్వీపర్‌గా పనిచేస్తుంది. బుధవారం రాత్రి పరిగి నుంచి వచ్చి ఇంట్లో ఒంటరిగా నిద్రించింది. కుమారుడు అభిలాష్ బంధువుల దగ్గరకు వెళ్లి గురువారం ఉదయం ఇంటికి వచ్చి తల్లిని పిలవగా.. ఉలుకుపలుకు లేదు. దీంతో చుట్టుపక్కల వాళ్ల సహాయంతో ఇంటిపై ఉన్న బండను తీసి చూడగా దూలానికి చీరతో ఉరి వేసుకుని మృతి చెందింది. జయమ్మ మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ మృతురాలి సోదరుడు సత్తయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాటన్ మిల్లులో అగ్ని ప్రమాదం



కాలిపోయిన పత్తి



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

రూ.70 లక్షల వరకు ఆస్తి నష్టం

పెద్దేముల్: మండల పరిధిలోని మారేపల్లి శివారులో ఉన్న సుమిత్ర కాటన్ మిల్లులో గురువారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో నిల్వఉన్న సుమారు 3,550 క్వింటాళ్లలో కొంత భాగం కాలిపోయింది. దాదాపు రూ.70లక్షల నుంచి రూ.80లక్షల వరకు నష్టం వాటిల్లిందని యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణం తెలియరాలేదు. రైతుల నుంచి కొనుగోలు చేసి, నిల్వ ఉంచిన పత్తి కాలిపోవడంతో తీరని నష్టం వాటిల్లిందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్ని మాపక శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు ఆర్పిందని చెప్పారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు అందజేస్తామన్నారు.

మాజీ సైనికుల నిరసన



అనంతగిరి: ప్రధాని నరేంద్రమోదీ మాజీ సైనికులకు ఓఆర్‌ఓపీ(వన్ ర్యాంక్, వన్ పెన్షన్) ఇస్తానని చెప్పి, మాట తప్పారని అనంతపద్మనాభ ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు యాదయ్య ఆరోపించారు. గురువారం దేశవ్యాప్త నిరసనలో భాగంగా వికారాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఒకే ర్యాంకు, ఒకే పోజిషన్, ఒకే విధమైన సదుపాయాలు కల్పించాలని ఎంఎస్‌పీని అందరికీ సమానంగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పలువురు మాజీ సైనికులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోషకాహారం ఇవ్వాలి



పరిగి: చిన్నారులతో మాట్లాడుతున్న డీబీ శీతల్



అనంతగిరి: మాట్లాడుతున్న శీతల్

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి డీబీ శీతల్

పరిగి: బాలసదనంలోని చిన్నారులకు పోషకాహారం అందజేయడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్ సూచించారు. గురువారం పట్టణంలోని బాలసదనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి చిన్నారుల భోజనంపై ఆరా తీవారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పిల్లలకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో లీగల్ న్యాయవాదులు వెంకటేశ్, రాము, న్యాయవాది రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ డాక్టర్లుగా ఎదగాలి

అనంతగిరి: వైద్య విద్యార్థులు భవిష్యత్‌లో ఉత్తమ డాక్టర్లుగా ఎదగాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్ పేర్కొన్నారు. అనంతగిరి గుట్టలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో గురువారం జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాగింగ్‌పై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి ఈ స్థాయికి తీసుకువచ్చారన్నారు. విద్యార్థులు సైతం రాత్రింబవళ్లు కష్టపడి చదివి పరిపూర్ణ వైద్యులుగా సమాజంలో అడుగు పెట్టాలన్నారు. ఈ క్యాంపస్‌లో ర్యాగింగ్‌కు తావు లేదని, ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీరోజు ప్రొఫెసర్‌లు చెప్పే పాఠాలను ఎప్పటికప్పుడు చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ న్యాయవాదులు వెంకటేష్, రాము, న్యాయవాది అవుటి రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఈవెంట్

- ఫాంహౌస్‌కు రూ.లక్ష జరిమానా
- నిర్వాహకుడి బైండోవర్



తహసీల్దార్ ఎదుట ఫాంహౌస్ నిర్వాహకుడిని బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

మొయినాబాద్: అనుమతి లేకుండా ఈవెంట్ నిర్వహించి మద్యం వినియోగించిన ఫాంహౌస్‌కు ఎక్సైజ్ అధికారులు రూ.లక్ష జరిమానా విధించారు. చేవెళ్ల ఎక్సైజ్ సీఐ శ్రీలత తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అరవిల ఫాంహౌస్‌లో గత ఏడాది ఎలాంటి అనుమతి లేకుండా ఈవెంట్ నిర్వహించి మద్యం వినియోగించారు. అప్పట్లో ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసి ఫాంహౌస్ నిర్వాహకుడిని తహసీల్దార్ గౌతంకుమార్ ఎదుట హాజరుపర్చి బైండోవర్ చేశారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించి ఫాంహౌస్ నిర్వాహకుడు ఇటీవల తిరిగి ఈవెంట్ నిర్వహించి మద్యం వినియోగించారు. చేవెళ్ల ఎక్సైజ్ పోలీసులు ఫాంహౌస్‌పై దాడిచేసి పట్టుకున్నారు. గురువారం తహసీల్దార్ గౌతంకుమార్ ఎదుట హాజరుపర్చి బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించినందుకు రూ.లక్ష జరిమానా విధించారు. చేవెళ్ల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్, చేవెళ్ల మండలాల్లోని ఫాంహౌస్‌లలో అనుమతి లేకుండా ఈవెంట్స్ నిర్వహించి మద్యం వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ శ్రీలత హెచ్చరించారు. ఎవరైనా ఈవెంట్ నిర్వహిస్తే ఎక్సైజ్ శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు.

ప్రజా శ్రేయస్సుకే సమగ్ర సర్వే

- ప్రతి అంశాన్ని నమోదు చేయాలి
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



స్టిక్కర్‌లను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే బీఎంఆర్ తదితరులు



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వేను అధికార యంత్రాంగం సమర్థవంతంగా నిర్వహించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. గురువారం తాండూరు మున్సిపల్ పరిధిలోని 27వ వార్డులో జరుగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన సర్వేను మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సందర్శించారు. గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ప్రతి ఇంటికి స్టిక్కర్ అంటించే కార్యక్రమం ఎంత వరకు వచ్చిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సర్వే నిర్వహిస్తోందన్నారు. ఇలాంటి సర్వే దేశంలోనే ఎక్కడ జరగలేదన్నారు. ఎవరైన వలస వెళ్లిన వారిని రప్పించి సర్వే చేయించాలన్నారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికి విద్య, వైద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. కులగణన సర్వేకు ప్రజా సంఘాలు, కుల సంఘాలు, మేధావులు, విద్యావంతులు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, మేనేజర్ నరేందర్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి థారాసింగ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, పట్లోళ్ల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేలా మార్కెట్

తాండూరు: రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేలా తాండూరు మార్కెట్ యార్డు నిర్మాణం చేపడుతామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణ శివారులో రూ.10 కోట్లతో వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రత్యేకత సాధించిందన్నారు. ఏ మార్కెట్ యార్డులో లేని విధంగా మార్కెట్ యార్డులో ఏడాది పొడవునా పంట ఉత్పత్తుల కొనుగోళ్లు నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న నెహ్రూగంజ్‌లో ఇరుకుగా ఉండటంతో పంట ఉత్పత్తుల కొనుగోళ్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కొత్తగా మార్కెట్ యార్డు నిర్మించాలని వ్యాపారులు, రైతుల నుంచి డిమాండ్ పెరిగిందన్నారు. గత పాలకులు మార్కెట్ యార్డు నిర్మాణాన్ని ఎన్నికల హామీకే పరిమితం చేశారన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు రూ.60 కోట్ల బడ్జెట్‌తో మార్కెట్ యార్డును రైతులకు, వ్యాపారులకు అనుకూలంగా ఉండేవిధంగా నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి థారాసింగ్, అధికారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం

పెద్దేముల్: గ్రామాల్లోని ప్రజలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బుద్దారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల ఏ బ్లాక్ అధ్యక్షుడు లొంక నర్సింహులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన వైద్యులతో మాట్లాడి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మహవీర్ ఆసుపత్రి వైద్యులు ప్రజలకు సేవలు అందంచారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి థారాసింగ్, నాయకులు ఉత్తమ్‌చంద్, మల్లేశం, రాములు, కిరణ్, డీవై.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.